క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో, తహసీల్దార్

బజార్‌హత్నూర్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని తహసీల్దార్ కునల గంగాధర్ అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ యువ జన సంఘం అధ్యక్షుడు డుబ్బుల చంద్రశేఖర్ అధ్వర్యంలో బుధవారం అంతర్రాష్ట్ర కబడ్డీ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఎంపీడీవో చౌహాన్ రాధ, ఎంపీవో మహేందర్‌రెడ్డిలు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రత్యూష, టీఆర్ఎస్ మండల కన్వీనర్ కానిందే రాజారాం, అంకుష్, ప్రకాశ్, ప్రభు, సురేశ్, చందు, ప్రభాకర్, సుకుమార్ పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం



సన్మానిస్తున్న తుడుందెబ్బ నాయకులు

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నియమించిన వైద్యులు భీంరావ్, శిల్పా, అలేఖ్య, శ్రావ్యవాణిలను బుధవారం తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్కే పాండురంగ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఆదివాసీ గిరిజనులు అధికంగా ఉన్నారని వారికి, 24 గంటలు వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు ఉయికే సుదర్శన్, నైతం రమేశ్, బాపురావ్, ఉత్తం, తుల్సీరాం, మాణిక్‌రావ్, ఎస్‌హెచ్‌వో ప్రకాశ్, సూపర్‌వైజర్ దేవిదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

22న రేషన్‌డీలర్ రాతపరీక్ష



అభ్యర్థులకు హాల్‌టికెట్ అందిస్తున్న ఆర్ఐ హుస్సేన్

ఇచ్చోడ: ఈనెల 22న జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో రేషన్ డీలర్ కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు రాతపరీక్ష ఉంటుందని ఆర్ఐ హుస్సేన్ తెలిపారు. ముఖరా(బి) పంచాయతీ కార్యాలయంలో అభ్యర్థులకు సర్పంచ్ అడమ్మారుతితో కలిసి బుధవారం హాల్ టికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖరా(బి) నుంచి 12 మంది, ముఖరా(కె) నుంచి 7, మాన్కుగూడ నుంచి 1, రగూగుడ నుంచి 3, దేవుల్‌నాయక్ తండా నుంచి ఆరుగురు మొత్తం 29 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారని పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ఇచ్చోడ: మైనార్టీ గురుకుల పాఠశాలల్లో 2023–24 సంవత్సరానికి 5వ తరగతిలో 40, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ యునూస్ సలీం తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 5వ తరగతిలో మైనార్టీలు 26, క్రిస్టియన్లు 2, సిక్కులు 1, బుద్దిస్టులు 1, ఎస్సీలు 2, బీసీలు 5, ఎస్టీలు 2, ఓసీలకు 1 చొప్పున సీట్లు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్ ఫస్టియర్‌లో మైనార్టీలు 26, క్రిస్టియన్లు 2, సిక్కులు 1, బుద్దిస్టులు 1, ఎస్సీలు 2, ఎస్టీలు 2, బీసీలు 5, ఓసీలు 1 సీట్ల చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న వారు నుంచి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 7995057874, 9059041271 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విధుల నుంచి మినహాయించాలి

ఖానాపూర్: 'కంటివెలుగు'లో పాల్గొనాలనే విధుల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు గుడిసె సంపూర్ణ అన్నారు. బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ఫారుఖ్‌తోపాటు ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ స్వామిలకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ కంటివెలుగు కార్యక్రమంలో పాల్గొనాలని ఎలాంటి అధికారిక ఉత్తర్వులు రాలేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను వదిలి తాము బయటకు రాలేని పరిస్థితి నెలకొందన్నారు. శిబిరానికి వచ్చే అధికారులు, సిబ్బందికి భోజనాలు ఏర్పాటు చేయాలని తమకు ఆదేశాలు, నిధులు రాలేదని పేర్కొన్నారు.

పాఠశాలలకు మహర్దశ

- మండలానికి రెండు బడుల ఎంపిక
- ఉమ్మడి ఆదిలాబాద్ మండలంలో 11 గుర్తింపు
- పీఎంశ్రీతో ఒక్కో పాఠశాలకు రూ. కోటి నిధులు



విద్యార్థులకు బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

ఆదిలాబాద్‌రూరల్: పేద విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య అందేలా సర్కారు బడులను తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ (ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని అమలు చేయనుంది. ఇందులో భాగంగా ప్రతీ మండలం నుంచి 2 పాఠశాలలను ఎంపిక చేసి ఐదేళ్ల వ్యవధిలో రూ.కోటి వరకు నిధులు అందించేలా ప్రణాళిక రూపొందించింది. ఈ పథకానికి పాఠశాలలను ఎంపిక చేసేందుకు 62 అంశాల్లో 130 మార్కులు కేటాయిస్తారు.

11 పాఠశాలల గుర్తింపు

పీఎంశ్రీ పథకం కింద ఎంపిక చేసేందుకు ఎంఈవోతోపాటు పలువురు ఉపాధ్యాయుల బృందం పలు పాఠశాలలను సందర్శించారు. అయితే అత్యధిక మార్కులు సాధించిన ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలను ఎంపిక చేస్తారు. ఆదిలాబాద్ ఉమ్మడి మండలంలో ఆదిలాబాద్ రూరల్ 31, మావల 07, ఆదిలాబాద్ అర్బన్‌లో 67 స్థానిక సంస్థలు, ప్రభుత్వ పాఠశాలలు మొత్తం 105 ఉన్నాయి. వీటిలో పీఎంశ్రీ పథకానికి 28 పాఠశాలలు ప్రాథమికంగా దరఖాస్తు చేసుకునేందుకు అర్హత సాధించాయి. వీటిలో ఆన్‌లైన్‌లో పొందుపర్చిన అంశాలను బట్టి కేంద్రం నిర్దేశించిన ప్రమాణాలు ఉన్న పాఠశాలలు 11 ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

ఎంపికైన పాఠశాలలు

మండలం	ఉన్నత పాఠశాల	పీఎస్, యూపీఎస్
ఆదిలాబాద్ రూరల్	02	05
ఆదిలాబాద్ అర్బన్	08	13
మావల	-	-

మార్గదర్శకంగా నిలిచేలా..

పీఎంశ్రీ పథకంలో ఎంపికైన పాఠశాలలను మిగతా బడులకు మార్గదర్శకంగా నిలిచేలా తీర్చిదిద్దుతారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు ఆధునిక సాంకేతిక వనరులు కల్పించేందుకు ప్రభుత్వాలు ఉదారంగా నిధులు కేటాయిస్తాయి. పాఠశాలల్లో సౌర విద్యుత్ సౌకర్యం, ఎల్ఈడీ దీపాల ఏర్పాటు, తోటల పెంపకం, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత చర్యలు, బొమ్మలతో బోధన, విద్యార్థుల సామర్థ్యాల మదింపు వంటివన్నీ చేపడతారు. ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తారు. విద్యార్థులకు వివిధ అంశాలపై కౌన్సెలింగ్ ఇస్తారు. దేశం, సంస్కృతి, వ్యక్తిత్వ వికాసంపై సంపూర్ణ అవగాహన కల్పిస్తారు. విద్యార్థుల్లో భాషాపరమైన సాంకేతిక సౌకర్యాలను కూడా అందుబాటులోకి తెస్తారు.

నివేదించాం



పీఎంశ్రీ పథకం కింద మండలానికి రెండు పాఠశాలలను ఎంపిక చేయనున్నారు. అందులో భాగంగానే గతవారం క్రితం సర్వేలు నిర్వహించాం. ఆ నివేదికలను ఉన్నతాధికారులకు అందజేశాం. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు అన్ని మౌలిక వసతులు కలగనున్నాయి.

– జయశీల, ఎంఈవో, ఆదిలాబాద్

అటెన్షన్ ప్లీజ్ నాణ్యతకు తిలోదకాలు



కంకర తేలిన ఎల్లయ్యపల్లి బీటీ రోడ్డు

బజార్‌హత్నూర్: మండలంలోని వర్తమన్నూర్ పంచాయతీ నుంచి ఎల్లయ్యపల్లి వరకు నిర్మించిన 1.5 కి.మీ బీటీ రోడ్డు ఏడాది తిరగకముందే దెబ్బతిని కంకరతేలింది. కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. రోడ్డు గుంతలమయంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తున్నాయి. రోడ్డుకు మరమ్మతు చేయించేలా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- అధికారి: నర్సింగ్, జేఈ పీఆర్, సెల్: 96763 43109

తాడ్వాయి వెళ్లిన అయ్యప్ప భక్తులు



వెళ్తున్న అయ్యప్ప భక్తులు

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులు మాల విరమణకు తాడ్వాయికు బుధవారం తరలివెళ్లారు. గత 41 రోజులుగా భక్తిశ్రద్ధలతో మాలధారణ గావించి విరమణ కోసం శబరి మందిరానికి వెళ్లారు. గ్రామంలో శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పకడ్బందీగా 'కంటి వెలుగు' నిర్వహించాలి



కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్‌టౌన్: నేటి నుంచి రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వైటీసీ కేంద్రంలో కంటి వెలుగు ఏర్పాట్లను బుధవారం పరిశీలించి వైద్యాధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కంటి వెలుగు శిబిరాలకు వచ్చే వారి వివరాల నమోదు, పరీక్షల నిర్వహణ, తదితర అంశాల గురించి అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన పూర్తి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పోటే శోభాబాయి కోరారు. మండలకేంద్రంలోని వైద్య శాఖ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కంటి వెలుగు ఇంటింటికీ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైద్యసిబ్బంది ఇంటింటా తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కోరెంగా గాంధారి, వైద్యసిబ్బంది శ్రీనివాస్, గేడం బలిరాం తదితరులు ఉన్నారు.

కంటి వెలుగుపై ప్రచారం

బోథ్: మండలంలోని పొచ్చర గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమంపై వైద్యాధికారి నవీన్‌రెడ్డి, ఎంపీడీవో లక్ష్మణ్ బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు అందజేసి, కంటి వెలుగులో భాగంగా ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో జీవన్‌రెడ్డి, వైద్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దాబా(బి)లో కంటి వెలుగు శిబిరం

నార్నూర్: గాదిగూడ మండలంలోని దాబా(బి) గ్రామంలో బుధవారం కంటి వెలుగు శిబిరం నిర్వహించారు. హెచ్ఈ రాథోడ్ రవీందర్, ఉప సర్పంచ్ సోయం హన్మంతరావు, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌సాయి, ఝరి పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



బోథ్: ప్రచారం నిర్వహిస్తున్న వైద్యులు, అధికారులు



శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

ఎస్సీ హాస్టల్‌కు స్థలం కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

బేల: బేలలో 35 ఏళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతున్న ఎస్సీ బాలుర హాస్టల్ పక్కా భవనం కోసం స్థలం కేటాయించాలని జిల్లా ఏబీవీపీ హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీశ్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎస్సీ హాస్టల్ సమస్యలపై ఏబీవీపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ బడాల రాంరెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ హాస్టల్‌లో వసతుల లేమితో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హాస్టల్ పక్కా భవనం కోసం స్థానికంగా సగం ఎకరా స్థలం కేటాయించి రూ.60 లక్షలతో భవనం నిర్మించాలన్నారు. రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపుకోసం ప్రత్యేక ట్యూటర్స్‌ను నియమించాలన్నారు. హాస్టల్‌ను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఏబీవీపీ జిల్లా ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ శివనిత్వార్ ఓంప్రకాశ్, సభ్యులు బిక్కి వినోద్, కృష్ణపెల్లి సాయి, ముజుందార్ ప్రీతం, పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేయిస్తంభాల గుడి సందర్శన



పూజల అనంతరం జెడ్పీచైర్మన్‌తో నాయకులు

కైలాస్‌నగర్: హన్మకొండ జిల్లాలోని ప్రసిద్ధ వేయిస్తంభాల గుడిని జెడ్పీచైర్మన్ జనార్దన్ రాథోడ్ బుధవారం సందర్శించారు. అక్కడి శివాలయంలోని రుద్రేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఘనంగా స్వాగతం పలికిన ఆలయ పూజార్లు శివలింగానికి పూజలు చేయించారు. అర్చన చేసి ఆశీర్వదించారు. గాదిగూడ వైస్ ఎంపీపీ యోగేష్, బీఆర్ఎస్ నాయకుడు మరుసుకోల తిరుపతి తదితరులు ఉన్నారు.

ఐకేపీ ఇన్‌చార్జి ఏపీఎంగా లింగమయ్య



లింగమయ్య

నేరడిగొండ: మండలంలోని ఐకేపీ ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న సుదర్శన్‌గా ఇటీవల నిర్మల్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. కుమారి క్లస్టర్ సీసీగా పనిచేస్తున్న గొడుగు లింగమయ్యకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆయన గురువారంం ఐకేపీ ఇన్‌చార్జి ఏపీఎంగా బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు. కాగా ఇన్నిరోజుల పాటు ఇక్కడ పనిచేసిన సుదర్శన్ బదిలీపై వెళ్లడంతో ఈయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

నార్నూర్: చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగమని మండల వ్యవసాయ శాఖ అధికారి గిత్తె రమేశ్ అన్నారు. మండలంలోని సుంగాపూర్ కొలాంగూడ గ్రామంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం–2023గా ప్రకటించిన నేపథ్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు చిరుధాన్యాలపై దృష్టి సారించేలా గ్రామీణ ప్రాంతంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తుడు ప్రేంసింగ్, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు సన్మానం



సన్మానిస్తున్న డీఎస్పీ నాయకులు

కైలాస్‌నగర్: జిల్లా టీఎన్జీవో నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన ఎస్.అశోక్, ఏ.నవీన్ కుమార్‌ను బుధవారం దళిత శక్తి ప్రోగ్రాం ఆధ్వర్యంలో సన్మానించారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో వారిని కలిసి పూలమాల, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. బాధ్యతాయుతంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరంగా పనిచేసే వారికి సమాజం గుర్తిస్తుందన్నారు. సమర్థవంతంగా ఉద్యోగుల సంక్షేమం కోసం పాటు పడుతూ మరింత ఉన్నత స్థానాలకు చేరాలని కోరారు. డీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్ మహారాజ్, నాయకులు సంతోష్, పవన్‌కుమార్, భైంసా మార్కెటింగ్ శాఖ కార్యదర్శి అన్నెల అడెల్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం



పాల్గొన్న భక్తులు

తాంసి: భీంపూర్ మండలం నిపాని గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 16వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అందంగా పూలతో అలంకరించిన రథంపై లక్ష్మీ, పద్మావతిదేవి, వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను పెట్టి డప్పుచప్పుళ్ల మధ్య గ్రామవీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. మహిళలు మంగళహారతులతో హాజరై పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు శివదత్తగిరి మహారాజ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి, సర్పంచ్ రాజన్న, గ్రామపెద్దలు మనీష్‌రెడ్డి, సుగుణాకర్ పాల్గొన్నారు.

పరామర్శ



ప్రమాదంలో గాయపడ్డ అశోక్‌ను పరామర్శిస్తున్న దశరథ్

ఇచ్చోడ: బీజేపీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. మండలంలోని నర్సపూర్‌లో ఇటీవల ప్రమాదంలో గాయపడ్డ బీజేపీ కార్యకర్త ముస్లె అశోక్‌ను బుధవారం ఆయన పరామర్శించారు. ఆయనవెంట జిల్లా ఉపాధ్యక్షులు మాధవ్ అమ్టె, కదండ బాబారావు, జిల్లా కార్యదర్శి కొల్లూరి చంద్రశేఖర్, నాయకుడు పెరమండ్ల పోశెట్టి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 27వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ చౌక్‌లో ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ అధ్యక్షుడు గుల్లపల్లి ఆనంద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బడుగు, బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలతో చేయూతనందించారని గుర్తుచేశారు. పట్టణ సుందరీకరణలో భాగంగా తొలగించిన ఎన్టీఆర్ విగ్రహాన్ని యథా స్థానంలో ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు రాజారెడ్డి, ఆత్మారాం, రాజేశ్వర్, సి.భూమన్న, ఎండి రఫీక్, పి.దేవదాస్, ఆత్రం జ్ఞానసుధ, జి.నాగన్న, జి.ఓమన్న, ప్రభాకర్, సంతోష్ రెడ్డి, షేక్ అహ్మద్, రాములు, సుభాష్, గంగారెడ్డి, బి.రాజేశ్వర్ రావు, బుచ్చన్న, పెంటన్న, పొచ్చన్న, చంద్రయ్య, సురేందర్ లండిగే, పంచపుల బాయి, రాజన్న పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అడేగామ(కె) కాలనీలో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ బోథ్ నియోజవర్గ కోఆర్డినేటర్ ఆత్రం జ్ఞానసుధ, ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రెసు పోతారెడ్డి, ఇచ్చోడ మండలాల కన్వీనర్లు బొజ్జ లక్ష్మణ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులను వినియోగించుకోవాలి



ఎరువులను అందిస్తున్న పాలకవర్గం

బోథ్: పంచాయతీలో సేంద్రియ ఎరువులను రైతులు తమ పొలాల్లో వేసుకోవాలని సర్పంచ్ మీరాబాయి అన్నారు. ఈ ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. మండలంలోని సాకెర పంచాయతీలో తయారు చేసిన సేంద్రియ ఎరువులను బుధవారం స్థానిక రైతులకు విక్రయించారు. పంచాయతీ కార్యదర్శి రవీందర్, భీంరావ్, నానాజీ, రంజిత్, భారత్, విలాస్ పాల్గొన్నారు.

బడి బయట పిల్లల సర్వే



సర్వే నిర్వహిస్తున్న కాంప్లెక్స్ సిబ్బంది

బోథ్: మండలంలోని గ్రామాల్లో ఈనెల 10న ప్రారంభమైన బడిబయట పిల్లల సర్వే బుధవారంతో ముగిసింది. మండల వ్యాప్తంగా 30 మంది బడి బయట పిల్లలను గుర్తించినట్లు కాంప్లెక్స్ సిబ్బంది పేర్కొన్నారు. వారిని వయస్సుకు తగ్గట్టు తరగతుల్లో చేర్పించినట్లు తెలిపారు. మరికొంతమందిని ఓపెన్ టెన్త్‌లో చేర్పించినట్లు పేర్కొన్నారు. సర్వేలో దత్తురాం, ప్రవీణ్, రమేశ్, వసంత్, ఎం.భూమన్న, జి.భూమన్న పాల్గొన్నారు.